### బార్ అండ్ రెస్టారెంట్లలో తనిఖీలు

రాంనగర్, నవంబర్ 21: కరీంనగర్ అర్బన్ ఎక్సైజ్ సీఐ తాతాజీ ఆధ్వర్యంలో సిబ్బంది కరీంనగర్‌లోని పలు బార్ అండ్ రెస్టారెంట్లలో తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో బస్టాండ్ వద్ద గల ఓ బార్ అండ్ రెస్టారెంట్ యాజమాన్యం సమయపాలన పాటించకపోవడంతో కేసు నమోదు చేసి రూ.10వేల జరిమానా విధించారు. నగరంలోని ప్రతి మద్యం దుకాణం, బార్ అండ్ రెస్టారెంట్లలో క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహిస్తున్నామని, ఎవరైనా నిబంధనలను ఉల్లంఘించినట్లయితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎక్సైజ్ నేరాలకు సంబంధించి సెల్ నంబర్ 8712658808కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

★ రామకృష్ణ గ్రూప్ (TS No. 1) Hyd. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులకు/పేషెంట్ల సేవకు, వంట/ఇంటి పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు 5 వేలు కమీషన్. తెలంగాణ అంతటా వర్కర్లను మీ ఇంటికి పంపగలము. Ph: 9618802390, 9912611122.
NT-314452

REAL ESTATE

★ రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడి పెట్టడం ద్వారా ప్రతిరోజు ఆదాయం పొందే అవకాశం. యాదగిరిగుట్టలో లగ్జరీ సూట్ ప్లాట్స్ కేవలం 26 లక్షలకే లాంచింగ్ ఆఫర్లో కలవు. సంప్ర|| సెల్: 9381128358
NTK-316682

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

# జమ్మికుంట వ్యాపారులపై ‘ఐటీ’ దాడులు

- జమ్మికుంట, సంగారెడ్డి జిల్లా జోగిపేట కాటన్ మిల్లుల్లో సోదాలు
- వ్యాపార భాగస్వాముల ఇండ్లల్లో ఏకకాలంలో తనిఖీలు
- రంగంలో దిగిన నాలుగు బృందాలు.. తెల్లవారుజాము నుంచి సోదాలు
- కరీంనగర్, సంగారెడ్డి జిల్లాల్లో కలకలం



ఐటీ అధికారులు తనిఖీలు చేస్తున్న కరీంనగర్ జిల్లా జమ్మికుంటలోని ఆదిత్య కాటన్ మిల్లు

జమ్మికుంట, నవంబర్ 21 : వివాదాలకు కేరాఫ్ అడ్రస్‌లుగా మారిన కరీంనగర్ జిల్లా జమ్మికుంట వ్యాపారులపై ఇన్‌కమ్ ట్యాక్స్(ఐటీ)అధికారుల దాడులు జరుగుతున్నాయి. జిల్లాలోని జమ్మికుంట, సంగారెడ్డి జిల్లాలోని జోగిపేట కాటన్ మిల్లుల్లో మంగళవారం తెల్లవారుజాము నుంచే అధికారులు తనిఖీలు చేపట్టినట్లు తెలిసింది. అంతేకాకుండా మిల్లులకు సంబంధించిన భాగస్వాములైన ముక్కా శివకుమార్, ముక్కా నారాయణ ఇళ్లల్లోనూ సోదాలు చేస్తున్నారు. మరి కొందరు భాగస్వాములను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. ఐటీ అధికారుల దాడుల్లో స్థిరాస్తులు, బినామీ పేర్ల మీద జమలు, పొంతనలేని ఆర్థిక లావాదేవీలు, నగదును గుర్తించినట్లు ప్రచారం సాగుతోంది. గత ఆర్నెళ్లుగా సదరు వ్యాపారులు ఎక్కువ మొత్తంలో నగదు డ్రా చేసి లావాదేవీలు నిర్వహించినందుకేనని.. గతంలో ఓ పార్టీకి చెందిన నేతకు కోట్లాది రూపాయలు సమకూర్చారనే ఆరోపణల నేపథ్యంలో దాడులు జరుగుతున్నాయని తెలుస్తోంది. వ్యాపార భాగస్వాముల్లో ఒకరు ‘ఐటీ’కి ఫిర్యాదు చేసినందుకు తనిఖీలు సాగుతున్నాయని సర్వత్రా చర్చ జరుగుతోంది. ఏది ఏమైనా జమ్మికుంటలో వ్యాపారులపై జరుగుతున్న ఐటీ దాడులు కరీంనగర్, సంగారెడ్డి జిల్లాలో కలకలం రేపుతోంది. కేంద్ర బలగాలకు చెందిన సిబ్బంది సహాయంతో మంగళవారం తెల్లవారుజామున నాలుగు వాహనాల్లో.. 10మందికి పైగా ఐటీ అధికారులు, సిబ్బంది జమ్మికుంటకు వచ్చినట్లు తెలిసింది. ఉదయం 6గంటల తర్వాత ఆదిత్య కాటన్ మిల్లు భాగస్వాములైన ముక్కా శివకుమార్, ముక్కా నారాయణ ఇళ్లలోకి, ఆదిత్య కాటన్ మిల్లులోకి ప్రవేశించారు. ఇంట్లో ఉన్న వ్యక్తుల, మిల్లులోని సిబ్బంది వద్ద ఉన్న సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. డోర్లు, మిల్లు గేట్‌లను మూసేశారు. కేంద్ర బలగాల సిబ్బందిని గేట్ల ముందు బందోబస్తును ఏర్పాటు చేయించి, అధికారులు సోదాలు చేస్తున్నారు. ఇదే సమయంలో సంగారెడ్డి జిల్లాలోని జోగిపేట మిల్లులో కూడా తనిఖీలు చేపట్టారు. భాగస్వామి బచ్చు భాస్కర్(ఇతడిపై కూడా గతంలో రెండు రోజుల పాటూ ఐటీ దాడులు జరిగాయి), తదితరుల వ్యాపార లావాదేవీలపై ఆరా తీస్తున్నట్లు సమాచారం. కాటన్ మిల్లుల్లో కొనుగోళ్లకు వచ్చిన సీసీఐ, మార్కెట్ అధికారులు, సిబ్బంది, రైతులను కూడా మిల్లుల నుంచి బయటకు పోనివ్వలేదు. ఫోన్లు తీసుకున్నారు. మిల్లు యజమానులతో సంబంధం లేదనే విషయాలు ధృవీకరించుకున్న తర్వాతే ఫోన్లు ఇచ్చారు. అధికారులను, సిబ్బందిని బయటకు పంపించినట్లు సమాచారం. మీడియాను సైతం లోనికి అనుమతించలేదు. ఇక, ఐటీ అధికారులు శివకుమార్ కొడుకు-కోడలు ఇంట్లోనే దవాఖాన నిర్వహిస్తున్నాడు. వారి రికార్డులు పరిశీలించారు. ప్రశ్నించి, విడిచిపెట్టారు. ప్రస్తుతం శివకుమార్‌ను మిల్లులో, నారాయణను అతడి నివాసంలోనే ఉంచి తనిఖీలు చేస్తున్నారు. అయితే తనిఖీలకు వచ్చింది ఐటీ అధికారులేనా..? గతంలో సీసీఐ కుంభకోణాలపై విచారణకు వచ్చిన సీబీఐ అధికారులా..? తెలియడం లేదు. వ్యాపార వర్గాలు మాత్రం ఐటీ అధికారులేనని చెబుతున్నాయి. ఇక.. ఐటీ అధికారులు దాడులు చేస్తున్నారనే సమాచారం పట్టణంలో దావానంలా వ్యాపించడంతో ఒక్కసారిగా వ్యాపార, వాణిజ్య వర్గాలు ఉలిక్కిపడ్డాయి. రికార్డులు మాయం చేసి.. మిల్లులు, ఇళ్లకు, తాళాలు వేసి పరారయ్యారు. ఆయా మిల్లుల్లో ఐటీ అధికారుల తనిఖీలు ఇంకా కొనసాగుతున్నాయి.

## ఉద్యమ ద్రోహి..శ్రీధర్‌బాబు

- పోరాడిన యువకులపై కేసులు పెట్టించిన్రు
- నియంత పాలనను అంతమొందించాలి
- బీసీ బిడ్డ పుట్ట మధూకర్‌కు పట్టంగట్టాలి
- ఓయూ జేఏసీ అధ్యక్షుడు, న్యాయవాది గడ్డం శ్రీరామ్

మంథని, నవంబర్ 21: మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు తెలంగాణ ఉద్యమ ద్రోహి అని ఓయూ జేఏసీ అధ్యక్షుడు, న్యాయవాది గడ్డం శ్రీరామ్ తీవ్రస్థాయిలో విరుచుపడ్డారు. ఆయనపై నమోదైన ఓ కేసు కోసం మంగళవారం మంథని కోర్టుకు వచ్చిన అక్కడే విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడ్డ సమయంలో మంత్రిగా ఉన్న శ్రీధర్‌బాబు ఉద్యమాన్ని అణిచి వేసే ప్రయత్నాలు చేశారన్నారు. ఎంతో మంది విద్యార్థులు, యువకులపై అనేక కేసులు పెట్టించారని మండిపడ్డారు. ఏపీ ఆఖరి సీఎం కిరణ్ కుమార్‌రెడ్డికి శ్రీధర్‌బాబు అత్యంత సన్నిహితుడిగా ఉంటూ ఉద్యమాన్ని అణచివేశారని ఆక్షేపించారు. ఆయన 2013లో పెట్టిన అక్రమ కేసుతో తాను కూడా తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నానన్నారు. తెలంగాణ ఉద్యమాన్ని కరీంనగర్‌లో జిల్లాలో ముందుకు తీసుకెళ్తున్నపై తనపై శ్రీధర్‌బాబు కక్షకట్టి కేసుల పాలుచేశారన్నారు. ఇందు కోసం కొత్తగా పెళ్లైన తనకు రవీందర్‌రాజ్ తో ఫోన్ చేయించి బయటికి రప్పించుకొని కారులో ఎత్తుకెళ్లి గోదావరిఖని టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో పెట్టారన్నారు. అక్రమ కేసును నాపై బనా యించి పోలీస్‌స్టేషన్‌లో చెట్టుకు కట్టేసి రోకలి బడ్డతో కొట్టడంతో పాటు గోర్ల తీస్తూ నా నా ఇబ్బందులు పెడుతూ నరకాన్ని చూపించారన్నారు. ఒక దశలో నన్ను ఎన్‌కౌంటర్ కూడా చేయాలనే ఆలోచనకు కూడా వచ్చానన్నారు. ఓయూ విద్యార్థులు తిరగబడడంతో వెనక్కి తగ్గారన్నారు. స్టేషన్ బెయిల్‌పై బయటికి రావాల్సిన నన్ను 40 రోజులు జైలులో ఉంచారన్నారు. నాలాగా ఎంతో మంది యువకులు, విద్యార్థులు శ్రీధర్‌బాబు పెట్టిన కేసులు ఇంకా ఇబ్బందులు పడుతున్నారన్నారు. మంథని నియోజకవర్గ ప్రజలంతా ఏకమై ఏండ్ల తరబడి అధికారంలో ఉన్న నిరంకుశ పాలనకు చరమ గీతం పాడి బహుజన బిడ్డ పుట్ట మధూకర్‌ను ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని ఆయన కోరారు.




మంథని కోర్టు ఆవరణలో మాట్లాడుతున్న గడ్డం శ్రీరామ్

# దళితులందరికీ దళితబంధు

- అభివృద్ధిలో తెలంగాణ దేశానికే అగ్రగామిగా నిలిచింది
- మానకొండూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్
- శంకరపట్నం మండలంలో ప్రచారం



కొత్తగట్టులో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌కు తిలకం దిద్దుతున్న మహిళ

శంకరపట్నం, నవంబర్ 21: ఎన్నికల్లో తనను ఆశీర్వదించి, గెలిపిస్తే అర్హులందరికీ దళితబంధు పథకం ఇస్తామని మానకొండూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ హామీ ఇచ్చారు. శంకరపట్నం మండలం కొత్తగట్టు, గొల్లపల్లి, లింగాపూర్, చింతలపల్లి, గుడాటిపల్లి, మొలంగూర్ గ్రామాల్లో మంగళవారం ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మాట్లాడుతూ, నియోజకవర్గంలోని ప్రతి దళిత కుటుంబానికి రూ.10 లక్షల సాయం అందిస్తామని పేర్కొన్నారు. హుజూరాబాద్ తరహాలోనే మానకొండూర్ నియోజకవర్గ దళితులకు సాయం చేస్తామని స్వయంగా సీఎం కేసీఆరే ప్రకటించారని గుర్తు చేశారు. అభివృద్ధిలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఉనికిని చాటుకోవడం కోసమే దొంగ రాజకీయాలు చేస్తున్నదని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ అభ్యర్థి కవ్వంపల్లి సత్యనారాయణ సంస్కారం లేకుండా మాట్లాడుతన్నాడని ప్రజలు చీత్కరించుకుంటున్నారనీ, అలాంటి నాయకుడికి ఓటు వేస్తే ప్రజలను ఎలా చూస్తాడో ఆలోచించాలని ఓటర్లను కోరారు. కరోనా సమయంలో కవ్వంపల్లి ఆచూకీ లేదని, ఇప్పుడు ఎన్నికలు రాగానే ప్రజలు గుర్తుకు వచ్చారా అని ప్రశ్నించారు. కవ్వంపల్లి కల్లబొల్లి మాటలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. ప్రజల ఆశీస్సులతో తిరిగి మూడోసారి భారీ మెజార్టీతో తాను గెలువబోతున్నట్లు జోస్యం చెప్పారు. సీఎం కేసీఆర్ సారథ్యంలో తమ సర్కారు ఎన్నికలు కాగానే మ్యానిఫెస్టోలో పెట్టిన అన్ని సంక్షేమ పథకాలను అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన కొత్తగట్టు శ్రీమత్స్యగిరీంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కాగా, ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యేకు మహిళలు బతుకమ్మలు, కోలాటాలతో ఘనస్వాగతం పలికారు. ఎంపీపీ ఉమ్మెంతల సరోజన, జడ్పీటీసీ లింగంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు గంట మహిపాల్, సర్పంచుల ఫోరం చైర్మన్ పల్లె సంజీవరెడ్డి, ఎంపీటీసీల ఫోరం చైర్మన్ పెద్ది శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ మొకిరాల కిషన్‌రావు, ఏఎంసీ వైస్ చైర్మన్ చౌడమల్ల వీరస్వామి, చైర్మన్ మలహర్‌రావు, మోరె అనూష, అంతం లత, ఎంపీటీసీ మయిన్, సీనియర్ నాయకులు ఉమ్మెంతల సతీశ్‌రెడ్డి, మాడ రాజిరెడ్డి, శ్యాంరావు, రాజిరెడ్డి, శ్రీనివాస్, ఐలయ్య, ఆదిత్యపాల్గొన్నారు.

# ఓటర్లందరికీ వీఐఎస్‌లు అందజేయాలి

కలెక్టరేట్, నవంబర్ 21: ప్రతి ఓటరుకూ ఓటర్ ఇన్ఫర్మేషన్ స్లిప్పు విధిగా అందజేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ వికాస్‌రాజ్ ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి పలువురు అధికారులతో కలిసి జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ వికాస్‌రాజ్ మాట్లాడుతూ, పోలింగ్ రోజు అత్యవసర సేవల కింద విధులు నిర్వహించే ఓటర్లు తమ ఓటు హక్కు ముందస్తుగా వినియోగించుకునేందుకు వీలుగా ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించినట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న ఓటర్ల కోసం రిటర్నింగ్ అధికారి కార్యాలయాల్లో ఫెసిలిటేషన్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. పట్టణ ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల్లో వందశాతం, గ్రామీణ ప్రాంతాల్లోని పీఎస్‌లలో 60శాతం వెబ్‌కాస్టింగ్ చేయాలన్నారు. మిగతాచోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఓటరు గుర్తింపు కార్డులు త్వరగా అందజేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా అధికారులతో జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి మాట్లాడుతూ, ఎన్నికల విధుల్లో పాల్గొనేవారు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేందుకు వీలుగా పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని కల్పించడం జరుగుతుందని తెలిపారు. అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం ఎంతమందికి కల్పించారని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో చొప్పదండి, కరీంనగర్ సెగ్మెంట్ల రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.